కథానిక

# ప్రతీకారం

## దోగిపర్తి వెంకటరమణ

పొలం గట్టుమీది కెక్కింది నాగూరు పేడ తట్టతో. నారపరెడ్డి ఎనిమిదేళ్ల కొడుకు భీములు నాగూరు కేసి కోరగా చూస్తూ, “ఏయ్! ఎందు చితుకు లెత్తుకెళ్ళేవంటే తన్ని తవిలేస్తా. రేపణ్ణించి, ఈకోస్తాకు రాకు” అన్నాడు జమీందారు హోదా చూపుతూ. నాగూరు పేడ కళ్లమీద కళ్ళేసి గంపలోకి ఎత్తుకుంది.

“ఏమబ్బాయి! సితుకు లేరుకుంటే నీ అయిస్సర్యం తరుగ్గోదేటి?”

“నోరు మూసుకుపో. పేడ దిమ్మరించేసి మరీ పో” అంటూ దగ్గరికెళ్ళి, తీసిపెట్టి చెంప మీద కొట్టాడు. నవనవలాడే బుగ్గ ఎర్ర మందారం లాగ కందిపోయింది. నాగూరు వెళ్ళిపోయిం దేడ్చుకుంటూ.

* * *

“అయోయ్! భీములూ! రేగ్గాయలు కోద్దాం రాయ్యా. అవతల వంపులో సెట్టు ఇరగ్గాసేసింది” పాలికాపు కొడుకు బుడత భీముల్ని లాక్కెళ్ళేడు.

తాటిచెట్ల వనంలో కాలివంకర బాటమీద కుర్రాళ్ళిద్దరూ నడుస్తున్నారు. తుమ్మచెట్లు ఇరు వైపులా విరబోసుకున్నై. గాలి గోడు తీవ్రంగా వుంది. తాటాకులు ఒకదాని కొకటి ఒరుసుకొని రొద చేస్తున్నై. కొన్నిచోట్ల తాటిచెట్లు ఒకే టెంకలోంచి మొలిచినట్లు నాలుగూ సందులేకుండా, ఆకాశంలోకి తలలు దూర్చి చూస్తున్నై. ఆ ప్రక్కనే వెడల్పయిన కాల్వలో నీరు జోరుగా పారుతోంది.

“వంతెనేదిరా! బుడతా!”

“ఓరి బాబోయ్! కాలువమీద తాటివంతె నిరిగిపోయిందయ్యో కాల్వలోకొట్టుకెల్తోంది.”

“ఒరేయ్! ఈదేద్దాం రా అవతల గట్టుకి.”

“ఓరి బాబోయ్! పెద్ద పెద్దోళ్లే ఈదలేరు. నువ్వెక్కడ ఈదుతావ్! పోదాంరా.”

భీములు పట్టిన పట్టు విడవలేదు.

అవగల గట్టుమీద ఇక్ష్వాకులనాటి మర్రిచెట్టు కాలవలోకి ఊడలు దింపేసి వుంది. ఇద్దరూ అడ్డంగాపడి ఈదుతున్నారు. గజ ఈతగాళ్లమల్లే ఈదుతున్నారు. భీములుజోరుగా ఈదేసి, మర్రి ఊడ బిర్రుగా పట్టుకొని గట్టెక్కేసేడు ఎలాగో.

“ఒరేయ్! బుడతా గట్టెక్కేశారా!” లంకా సముద్రం దాటేసిన హనుమంతుడిలాగ విజయగర్వంగా అన్నాడు.

బుడతడింకా ఈదుతున్నాడు. ఎక్కడుందో బురదపాము. దాని తస్సాదియ్యా కాలు చుట్టబెట్టేసింది.

“అమ్మో! అమ్మో కాలట్టుకుందిరా బాబూ.”

భీములింకా చేత్తో ఊడొదల్లేదు. ఆ ఊడే బాగా కాలవనీటిలోకి అందేది.

“ఊడొదిలేయ్‌రో.”

“నే నొదల్నురా. నీ వూడ లేకుండా నే రావాల్రా.”

బురదపాము బుడతడి కాలొదల్లేదు.

భీములు చేతిలో ఊడ వదల్లేదు.

ప్రవాహం మంచి వేగంలో వుంది. బుడత కొండకొమ్మమీంచి పడేరాతిలా విలవిలా తన్నుకుంటున్నాడు.

“ఒరేయ్ వదలు బాబూ ఊడ.”

గట్టుమీది కెక్కడానికి సహస్రవిధ ప్రయత్నాలు చేసేడు. రేగడినేల. గచ్చులా జారిపోతుంది. బురదపాము తెగ రక్తం తాగేస్తోంది. ప్రవాహం వేగంగా ముందుకు లాగేస్తోంది. అతడు సర్వవిధాలా నిరాధారి. నాటకం ఆడుతున్నాడనుకున్నాడు. అతని ముఖంమీది

నురుగు ఇతనికి నవ్వులాగ కన్పించింది.

ప్రవాహం ముందుకి లాక్కుపోతోంది.

"ఇదిగోరా బుడతా! ఇదిగోరా ఊడ, ఊడ." ప్రవాహం ముందుకి లాక్కుపోతోంది. ప్రవాహం వెనక్కి తిరగలేదు. ముందుకే...

*　　*　　*

అవతల గట్టుమీద నాగూరు ఇది చూసి బెంబేరెత్తి పారిపోయింది. భీములు కళ్లు చీకట్లు కమ్మేయి.

నారపరెడ్డి కొడుకు నొదిలేసేడు. బుడత పోయినందుకు కొడుకు నేమనలేదు. నాగూరు చెప్పొస్తే దాన్ని చీవాట్లుపెట్టి తగిలేశాడు.

"కుట్టుకుంక! ఈడికేం తెలుస్తది. ఆడి కర్మాన ఆడుపోయేడు" అన్నాడు నారపరెడ్డి.

పాలికాపులు గగ్గోలెత్తిపోయేరు. ఉన్న ఒక్క కొడుకునీ ఊరినట్టేట్లో ముంచేసేరు.

నాగూరు బుడతని 'మామా' అని పిల్చేది. ఇపుడు పిలవడాని కెవరూ లేరు.

*　　*　　*

ఆరేళ్ళు గడిచిపోయేయి. నాగూరు పెళ్ళి కూతురైంది. వీరబాహుతో పెళ్ళి అయిపోయింది. అత్తింటి కాపురానికి వచ్చేసింది. ఈర బాహు భీములు పొలంలో పాలికాపు.

భీము లావుపాళ్ళో రౌడీ. స్త్రీల మానాలకు దాడి. పాము నాలికల్లాంటి కోరమీసాలు తిప్పితే విషం రాలాలిసిందే! జ్యోతుల్లాంటి ఎఱ్ఱటి కళ్ళు చీకటిని వెతుకుతూంటై. చిన్నప్పటినుంచీ కొడుకుని వదిలేసి చచ్చాడు రెడ్డి! అదే ఇప్పుడు పెద్దపులి; కాలనాగం. పసి పట్టిందా కాటువేసిందే!

ఆవేళ నాగూరు ఈరబాహుకి చద్దికూడు తెచ్చింది. భీములక్కడే వున్నాడు.

"నీ పెళ్లామేటిగా"

"అవునుబాబూ"

"చెప్పేవుగాదేటిరా! మంచిదాన్నే కూడ దీసేవ్"

అంటూ మీసాల పక్కనుంచి నవ్వేడు. ఆ నవ్వులో విషం తొణికిసలాడుతోంది. ఆవాసన నాగూరికి తగిలింది. అటుప్రక్కకి ముఖం త్రిప్పేసుకుంది.

"ఏదోబాబూ" అన్నాడు ఈరబాహు.

ఈర బాహువింటికొచ్చేడు రాతిరి.

"మా మంచోడి దగ్గరే కుదిరేవ్ లే. దొంగ ధవ! నవ్వుతాడు! చిన్నప్పుడు తీసి పెట్టి సెంప మీద లాగోడు."

"ఎవరే" అన్నాడు వీరబాహు.

"ఎవరేంటి! మీ దొరభీములు. చిన్నప్పటి నుంచీ ఎరుగుదును. ఆవేళ అళ్ల పొలంలో పేడ కడి ఎత్తుకుంటూంటే అబ్బి నా చెంపమీద దిమ్మ తిరిగిపోయేట్టు కొట్టేడు"

"నిన్నే"

"ఆఁ బుడతణ్ణి సంపింది కూడా యీడే. నేనూసా" ఈరబాహు కలత పడ్డాడు.'సరేలే' అనుకున్నాడు. భీములు నాగూరుని చూచి పక పక నవ్వుతూన్నట్టు కన్పించేడు. కోరమీసాలు మెలేస్తున్నాడు. విషం కక్కుతూన్న పాముల్లా న్నాయి ఆ మీసాలు! అబ్బ! తనేంచేస్తున్నాడు! తన యెద్దువగ్గర నుంచుని దువ్వుతున్నాడు!

బుడతణ్ణి చంపింది ఈడేకదూ! బుడ తెవరు? తనకో వరసలో మామకొడుక్కదూ!

వీరబాహుకెక్కడలేని రోషం తన్నుకొచ్చింది. దగ్గరున్న గడ్డపార విసిరేడు. తప్పిపోయింది! కొద్దిలో తప్పిపోయింది! భీములు పకపక నవ్వుకుంటూ వెళ్ళిపోతున్నాడు!

"ఏఁవిటాలోచిత్తన్నావ్" అంది నాగూరు.

ఇప్పటికి మెళుకువొచ్చింది.

"ఏంలేదు. ఆణ్ణి సంపేదాకా నిద్దరపట్టదు."

*　　*　　*

"ఏటకెల్దాంరా ఈరా"

భీములికి వేటమీద సరదా. పది పన్నెండేళ్లప్పుడు తండ్రితో వెళ్ళేవాడు. అక్కడికి ఏడెనిమిదిమైళ్ల దూరంలో చిట్టడవులున్నై. అపుడపుడు చిరుతపులులూ అవి కూడా వుంటూ వుంటవి.

భీములు భుజస్కంధాలు ఉలొక్కపిండాల్లాగుంటై. ఒక అడవి పందిని తేలిగ్గా ఎదురొక్కొంటాడు. వాడు ఎందరి మాన ప్రాణాలు బలిగొన్నా కిక్కురుమనడానికి వీల్లేదు.

"చందుర్తి ఏటకెల్దాంరా"

"ఏ ఏట బాబూ?"

"పందులు, పిట్టలు, లేళ్లు, దుప్పులు - రేపే పోదాం. తెల్లారకుండానే చద్దికూడు కట్టుకొని రా. ఇద్దరం కలిసి పోదాం."

భీములు, వీరబాహు సమాన బలిష్ఠులే. వీర బాహు శరీరమంతా కండలు దేరిపోయి రాతి విగ్రహం లాగుంటాడు. భీములు ఇంటిముఖం పట్టేడు. తాటివనంలో కాలిబాటమీద పోతు న్నాడు.

ఎదురుగుండా నాగూరు వస్తోంది! భీములి ఉద్రేకం పొంగి నఖశిఖపర్యంతం పరవళ్లు దొక్కింది. భీముల్ని చూచి నాగూరు వెనక్కి తగ్గింది. గుండెల్లో రాయిపడింది. ఒంటరిది తుంటరి వెధవేం చేస్తాడో! భీములు ముందు కొచ్చేడు. "నాగూర్ నన్ను మర్చిపోయేవా?"

"లేదుబాబూ లేదు. నిన్ను మర్చిపోతానా బాబూ!"

మెలికమీసంలోంచి నవ్వేడు. కొంగు పట్టుకొని లాగేడు.

"వదలుబాబూ! పోవాలి!" నాగూరు మనసు తికమక పడిపోయింది.

"ఓరి బాబోయ్" కేకవేసింది.

"నోరుముయ్. నోరు మెదిపావా ముందు తంతా. ఇక్కడరిచినా ఎవడూలేడు."

నిజమే! అక్కడ అరణ్య రోదన. ఆమె అతని విషహృదయపు కాటు తినక తప్పలేదు.

*      *      *

"ఏటకెల్దాందాబాబూ" ప్రొద్దున్నే సిద్ధ మయ్యాడు వీరబాహు. భీములు త్రుళ్ళిపడ్డాడు. నాగూరు చెప్పలేదూ? ఎలాగ చెబుతుంది? తనకు జరిగిన పరాభవం! వీరబాహుకు చెపితే ఇంక ఇంటినుంచి తగిలేస్తాడని భయంగాబోలు వీరబాహుకి తెలీదు. నాగూరు చెప్పలేదు అంతేకదూ.

వేటకు బయల్దేరారు. యోధాను యోధులు. భీములి చేతుల్లో గుళ్ళ తుపాకి. చింపిరి చింపిరి అల్లిబిల్లి అల్లకంలో చెట్లులతలు కలిసిపోయినై, దూరంలో కొండలు గొడుగులెత్తుకొని ఉన్నై. అడవిలో ఆవేళ ఏం కారణమోగాని ఒక్క లేడి పిల్లయినా లేదు.

కొండవాగు గట్టుమీంచి నడుస్తున్నారు. దూరదూరంగా ఏవో అరుపులు. కాని జాడ ల్లేవు.

"ఏంరా వీరా జంతువులేయిరా?"

"ఏమో బాబూ. ఏ యమలోకంలో కెళ్ళేయో" కొండసానువుల్లో మళ్లీ పొదలు. అమధ్య నాగవాసాలైన మహావల్మీకాలు.

వర్షాకాలమేమో కొండవాగు మహావేగంలో పారుతోంది. మింగేద్దామా అన్నంత వడిలో పారుతోంది.

కాలిబాటమీద నడుస్తున్నారు. 'అంతూ దరీ లేని ప్రదేశం' అన్నాడు భీములు. 'అవును బాబూ' అంటూ వీరబాహు వాగులోకి కాలు విసిరేసేడు. కొండవాగు జలజలా ప్రవహి స్తూంది. ఆవాగు గట్టుమీంచే నడుస్తున్నారు.

"ఎంత లోతువుందో" అంటూ తొంగి తొంగి చూచేడు భీములు. 'దిగితే తెలుస్తది' అంటూ సత్తువకొలదీ త్రోసేసేడు . 'చావరా యెదవా, నా పెళ్ళాన్ని పాడుచేసినోడివి నువ్వెందుకు భూమ్మీద'."

సూర్యుడు "నే రహస్యం చెప్పనులే" అంటూ సముద్రంలోకి గ్రుంగిపోయేడు.

---

అమెరికా శాసన సభాధ్యక్షుడైన (స్పీకర్) రేబర్న్ ఏప్రిల్ 4 వ తేదీని, మంచూరియాలో "చైనాకు చెందని యితరసేనలు" సమీకరింప బడుతున్నాయని శాసనసభలో ప్రకటించాడు. దీని మీద అనేక అమెరికన్ వార్తా పత్రికలు, మంచూరియాలో సమీకరింప బడుతున్నవి సోవియట్ సేనలని రేబర్న్ వుద్దేశమని వ్యాఖ్యానించాయి.

మంచూరియాలో ఎటువంటి సోవియట్ సేనలూ లేవనీ, యీవార్తలు అభూత కల్పనలూ, అసత్య ప్రచారములూ అనీ వాటిని ఖండిస్తూ టాస్ వార్తాసంస్థ అధికార ప్రకటన చేసింది.